సాక్షి చిత్తూరు

శుక్రవారం ı 29 ı నవంబర్ ı 2024



లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. - 8లో



టమాట ధరలు పైపైకి!

పలమనేరు మార్కెట్లో టమాట ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడితేనే వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమవుతుందని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

30న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఆసక్తి ఉన్న వారు గుంటూరు క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీల్లో పాల్గొనాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్ 14, 16, 18 బాల, బాలికలు, పురుషులు, మహిళలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. సొంత సైకిల్‌తో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం గుద్రోల్ పాఠశాలలో ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఇతర వివరాలకు 98493 79932, 97080 92077ను సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు జిల్లాలో దివ్యాంగులకు క్రీడాపోటీలు

జిల్లా కేంద్రంలోని కణ్ణన్ పాఠశాల ఆవరణలో ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న దివ్యాంగులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన వెల్లడించారు.

వచ్చే నెలలో సీఎం కుప్పం రాక

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబర్ మూడో వారంలో కుప్పంలో పర్యటించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. నియోజకవర్గ స్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం పైలెట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ సరఫరా చేసేందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే సర్వే పూర్తి చేసినట్లు దీనిపై సంబంధిత అధికారులు దృష్టిలో పెట్టుకుని కృషి చేయాలని సూచించారు. కుప్పం అభివృద్ధిపై ఇప్పటికి తయారు చేసినా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

వివరణ ఇవ్వండి

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ మాజీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి(రిటైర్డ్)పై వచ్చిన ఫిర్యాదులకు వివరణ ఇవ్వాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభాకర్‌రెడ్డిపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గీర్వాణీచంద్రప్రకాష్ ఫిర్యాదు చేశారు. దీనిపై విరమణ పొందే మూడు రోజుల ముందు ప్రభాకర్ రెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశాలపై ఆయన కోర్టుకు వెళ్లారు. ఇప్పుడు తాజాగా ఆయనపై అభియోగాలు మోపుతూ జీవోలు 677, 63 విడుదల చేశారు. ఈ అభియోగాలపై ప్రభాకర్‌రెడ్డి 15 రోజుల్లోపు వివరణ ఇవ్వాలని, తదుపరి ఆయన 10 రోజుల్లోపు లిఖిత పూర్వకంగా అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

నేడు త్రోబాల్ పోటీలు

కాణిపాకం: రాష్ట్ర స్థాయి ఎజీఎఫ్ త్రోబాల్ పోటీలను శుక్ర, శనివారాల్లో పూతలపట్టులో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వసంతవాణి తెలిపారు. పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 13 జిల్లాల బాల బాలికలు హాజరవుతారని, ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా పోటీలు ప్రారంభమవుతాయని ఆమె పేర్కొన్నారు.

డీఎస్పీల బాధ్యతల స్వీకరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డీటీసీ) డీఎస్పీగా జె.రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనతోపాటు 8వ బెటాలియన్ డీఎస్పీలుగా జీవీ కృష్ణారావు, ఎస్కే సైదా సైతం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వీరికి చిత్తూరులో పోస్టింగ్ ఇచ్చారు. వీరు ముగ్గురూ వేర్వేరుగా ఎస్పీ మణికంఠను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఇళ్లను పూర్తి చేయించండి

గంగాధర నెల్లూరు: మండలంలోని జగనన్న కాలనీ లేఔట్‌లో అసంపూర్తితో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ పద్మనాభం ఆదేశించారు. మండలంలోని కోటాగరం పంచాయతీ ఒడ్డుపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను హౌసింగ్ పీడీ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లను ఇదివరకే 100 రోజుల్లో పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాలను తనిఖీ చేస్తున్న పీడీ పద్మనాభం



పద్మావతీ అమ్మవారుకి ఊంజల్ సేవ



చిన్న శేషవాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

పడగల నీడన పగడపు తల్లి

దేవతలు అతిథులుగా రాగా.. అఖిల భక్తకోటి ఆనంద పరవశం కాగా.. ఎగిరింది ధ్వజపటం.. బ్రహ్మాండ నాయకుడి ప్రియదేవేరి పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు జరిగింది శ్రీకారం.. తిరుచానూరులో అమ్మవారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి శ్రీవారి దేవేరి చిన్న శేషవాహనంపై మురళీకృష్ణుడి రూపంలో భక్తజనాన్ని కటాక్షించారు.

– చంద్రగిరి




పింఛన్ల కోత.. వితంతువులకు వాత

కొత్త సర్కారు జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా సామాజిక పింఛన్లకు కోత పెడుతూ వస్తోంది. ఇది వృద్ధుల పాలిట శాపంగా మారుతోంది. ఇప్పుడు తాజాగా వితంతువులకు వాత పెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో కేవలం ఈ నెల 1వ తేదీ నుంచి వితంతువులైన వారు మాత్రమే అర్హులంటూ పేర్కొంది. ఇదేం విచిత్రమో అర్థంకాక అధికారులే అయోమయంలో ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి వితంతువులైన మహిళల ప్రస్తావనే లేదు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామంటూ ఇచ్చిన హామీ పరిస్థితి ఏంటో పాలకులకే తెలియాలి.



వితంతు పింఛను అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

- ఈ నెల నుంచి వితంతువులైన వారికే కొత్త పింఛన్
- అంతకుముందు వారికి మొండి చేయి
- తాజా ఉత్తర్వులు జారీచేసిన కూటమి సర్కారు
- సామాజిక పింఛన్లు తగ్గించేందుకు కూటమి కుట్ర



File No.SERP-17021/50/2024-PROJ MANG-ADMN-SERP

GOVERNMENT OF ANDHRA PRADESH

SOCIETY FOR ELIMINATION OF RURAL POVERTY

(Dept. of Rural Development)

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా.. నేటి వరకు ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరైన దాఖలాలు లేవు. అంతేకాక చాపకింద నీరులా పింఛన్లు తగ్గించుకుంటూ వస్తున్నారన్న విషయం గణాంకాలు చూస్తే తెలుస్తోంది. పింఛన్ మొత్తం పెంచామని సంబరాలు చేసిన కూటమి ప్రభుత్వం, కొత్త వారికి ఎందుకు పింఛన్లు మంజూరు చేయడం లేదో సమాధానం చెప్పడం లేదు. అసలు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశమే నేటి వరకు కల్పించకపోవడం గమనార్హం. అర్హత ఉన్న వందలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త పింఛన్లు ఇవ్వాల్సిన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో తొలగిస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ సర్కారు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కులం, మతం, వర్గం, పార్టీలు అనే తేడా చూడకుండా పారదర్శకంగా పింఛన్లు అందజేసింది. ప్రతి ఏటా కొత్త పింఛన్లు పొందేందుకు మరో అవకాశం కల్పించింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అర్హులైన పింఛనుదారుల పొట్టకొడుతోంది.

నెల వారీగా తొలగించిన పింఛన్ల వివరాలు

జూలై	548
ఆగస్టు	634
సెప్టెంబర్	1,513
అక్టోబర్	2,819
నవంబర్	3,670
మొత్తం	9,184

ప్రతి నెలా జిల్లాలో అందజేస్తున్న పింఛన్ల సంఖ్య

జూలై	2,71,253
ఆగస్టు	2,70,619
సెప్టెంబర్	2,69,740
అక్టోబర్	2,68,434
నవంబర్	2,67,583



హామీ అటకెక్కింది

50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఊరూ వాడ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీని తుంగలో తొక్కారు. అసలు కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో కూడా చెప్పలేని పరిస్థితిలో కూటమి సర్కారు ఉందని క్షేత్రస్థాయిలో ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం పకడ్బందీగా పింఛన్లకు కోత పెడుతూ ముందుకు వెళుతోంది.

కొంత మందికే లబ్ధి

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ప్రతి నెలా 59,902 మందికి వితంతు పింఛన్లు అందజేస్తున్నారు. అయితే కొత్త ఉత్తర్వుల కారణంగా కొంత మందికే లబ్ధి చేకూరేలా కూటమి ప్రభుత్వం కుట్రకు పాల్పడింది. వితంతువులు మాత్రమే కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. అది కూడా నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ 1 మధ్య పింఛన్ పొందుతున్న భర్త మృతి చెంది ఉంటే వెంటనే భార్యకు డిసెంబర్ నుంచి వితంతు పింఛన్ అందజేయనున్నట్లు సూచించారు. అంటే అంతకుముందు జనవరి నుంచి పింఛన్ పొందుతూ నవంబర్ 1 కంటే ముందే భర్తను కోల్పోయిన వితంతవులకు పింఛన్ మంజూరు కాదన్నమాట. అంతేకాక వారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా కల్పించలేదు.

అర్హులందరికీ గతంలో పింఛన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరయ్యేది. ఎలాంటి షరతులు, నిబంధనలు ఉండేవికావు. దరఖాస్తులను సైతం వలంటీర్లే సచివాలయాలకు తీసుకెళ్లి ఆన్‌లైన్ చేసి మంజూరైన వెంటనే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ మొత్తాన్ని అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న వాటిని ఏ విధంగా కోత పెట్టాలనే దానిపై శ్రద్ధ చూపుతుండడంతో అర్హుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కొత్త నిబంధనలు అన్యాయం



దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని అర్హులకు న్యాయం చేసేలా కూటమి సర్కారు చర్యలు చేపట్టాలి. అయితే పూటకో సర్క్యులర్ పేరుతో పేదల పొట్టకొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వితంతు పింఛన్ల కోతకు తాజాగా జారీచేసిన ఉత్తర్వులు చాలా అన్యాయం. ఆ సర్క్యులర్ వల్ల చాలా మంది నష్టపోతారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆ సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

– వాడ గంగరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

పింఛన్ల సంఖ్య తగ్గించేందుకే..



జిల్లా వ్యాప్తంగా పింఛన్ల సంఖ్యను తగ్గించేందుకే కొత్త సర్క్యులర్‌ను కూటమి ప్రభుత్వం విడుదల చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని సర్క్యులర్‌లు ఇప్పుడు ఎందుకు జారీచేస్తున్నారు? 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఆ హామీని వెంటనే అమలు చేయాలి. వితంతు పింఛన్ల మంజూరులో కొత్త సర్క్యులర్‌ను రద్దు చేయాలి.

– సురేంద్రనాథ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి

నివారణతోనే ఎయిడ్స్ కట్టడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎయిడ్స్ కట్టడికి నివారణ ఒక్కటేమార్గమని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని లారీ అసోసియేషన్ వద్ద గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి వ్యాప్తిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తప్పు చేసే ముందు కుటుంబ సభ్యులు ఉన్నారనే విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీబీ అధికారి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆత్మీయ నివాళి



సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి గురువారం సీఎం చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అంజలి ఘటించారు. రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో భాగంగా సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ ఇతర కుటుంబ సభ్యులు బుధవారం నారావారిపల్లెకు చేరుకున్నారు. అనంతరం గ్రామంలోని బావి వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, నారా రోహిత్, నారా గిరీష్‌తో కలసి పిండ ప్రదానం, కర్మక్రియల్లో పాల్గొన్నారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో కర్మక్రియలు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం సీఎం తిరుగు ప్రయాణం కానున్నారని జిల్లా అధికార యంత్రాంగం ఓ ప్రకటనలో తెలిపింది. – చంద్రగిరి

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎయిడ్స్ మహమ్మారి లేని సమాజాన్ని నిర్మించేందుకు అన్ని వర్గాల వారు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలను తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. హెచ్ఐవీ కేసులు తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. జిల్లాలోని ఆస్పత్రులు, జన సమూహం ఉన్న కూడళ్లలో బ్యానర్లు ప్రదర్శించాలని సూచించారు. నాగరికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ వింత పోకడలు వస్తున్నాయన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ వచ్చిన వారు ఏఆర్‌టీ మందులు తప్పనిసరిగా వాడటం మొదలుపెట్టాలని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, వ్యాధి నిరోధక టీకాల అధికారి హనుమంతరావు, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్ టీచర్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో డిసెంబర్ 7న మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని పకడ్బందీగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జారీ చేసిన నియమ నిబంధనలను పాటిస్తూ సమావేశాలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో చెప్పారు.

క్లుప్తంగా

మొగిలిలో నెమలి



మొగిలి వద్ద రహదారిపై సంచరిస్తున్న నెమలి

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయం సమీపంలో గురువారం నెమలి రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా స్థానికులు ఉత్సాహంగా తిలకించారు. కొన్ని రోజులుగా నెమలి పంటపొలాల వద్ద సంచరిస్తోందని గ్రామస్తులు, రైతులు తెలిపారు. నెమలి రహదారిపైకి రావడంతో వాహనాల్లో వెళ్లేవారు కాస్త ఆపి ఆసక్తిగా తిలకించారు. పగటి పూట పొలాల్లో తిరుగుతూ రాత్రి సమయంలో చెట్లపై ఉంటోందని స్థానికులు చెబుతున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కాణిపాకం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన యాదమరి మండలంలో వెలుగుచూసినట్లు ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు, మండలంలోని గుడికిమానుపెంట గ్రామానికి చెందిన వెంకటేశులు(40) ఆర్థిక సమస్యలతో కుటుంబంలో కలహాలు వచ్చాయి. దీంతో విషం తీసుకున్నాడు. వెంటనే కుటుంబీకులు అతడిని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మెగా.. దగా



పూతలపట్టుకు చెందిన రాజేశ్వరి భర్తతో పాటు తిరుపతిలో ఉంటోంది. ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేస్తుండేది. కూటమి సర్కారు డీఎస్సీపై ఆశలు కల్పించడంతో ఉద్యోగాన్ని మానేసి, తిరుపతి వచ్చి 5 నెలలుగా పరీక్షకు సిద్ధమవుతోంది. ఆమెకు ఉన్న ఇద్దరు పిల్లల్లో ఒకరిని భర్త చూసుకుంటుండగా, మరో పిల్లాడ్ని తల్లి వద్ద ఉంచి, ఎలాగైనా కొలువు సాధించాలన్న పట్టుదలతో చదువుతోంది. కానీ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన ఆలస్యమవతుండడంతో మానసిక ఒత్తిడికి గురవుతోంది. ఒక్క రాజేశ్వరికే కాదు.. డీఎస్సీ శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులందరి వేదన..

- ఉమ్మడి జిల్లాలో 1,473 ఖాళీల గుర్తింపు
- ఎదురుచూపుల్లో నిరుద్యోగులు
- రోస్టర్ పాయింట్ల వెరిఫికేషన్ పేరిట తాత్సారం
- పోస్టుల బ్లాక్‌తో ఉద్యోగోన్నతులకు చెక్
- కూటమి ప్రభుత్వం రోజుకో ప్రకటనతో గందరగోళం



తిరుపతి ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ ప్రకటనపై నిరుద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే అని గొప్పలు పలికిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ ఊసేలేదు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై రోజుకో ప్రకటన చేయడంతో నిరుద్యోగులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేస్తారని, ఎంతో ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులకు వాయిదా పడడంతో నిరాశే మిగిలింది. ఇంతకీ ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందో..? లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి. టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డీఎస్సీకి రేయింబవళ్లు సిద్ధమవుతున్నారు. కొందరు ప్రైవేటు స్కూళ్లలో ఉద్యోగాలు మానేసి.. మరీ డీఎస్సీకి శిక్షణ తీసుకుంటున్నారు. అదిగో.. ఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంపై నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రోస్టర్ పాయింట్లతో రాద్ధాంతం

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసమని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఖాళీ పోస్టుల రోస్టర్ పాయింట్ల లెక్క తేల్చాలని ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో రోస్టర్ పాయింట్ల వ్యవహారంతో ఇటీవల జరిగిన ప్రమోషన్ల ప్రక్రియలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై కాలయాపన చేస్తున్న నేపథ్యంలోనే తేనెతుట్టెను కదుపుతోందని ఉపాధ్యాయులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో విలీనమైన సమయంలోనే మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో క్యాడర్ స్ట్రెంత్ వివరాలను స్థిరీకరించాల్సి ఉండగా, అప్పట్లో జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఇప్పుడు సమస్యలొచ్చిపడ్డాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖాళీల గుర్తింపుపై మీనమేషాలు

మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 1,473 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నారన్న క్షేత్రస్థాయి నివేదికలతో ప్రభుత్వం డైలమాలో పడింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,473 ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు లెక్క తేల్చారు. వీటిలో ఎస్జీటీ పోస్టులు 944కాగా, స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లిష్–108, తెలుగు–42, హిందీ–21, ఉర్దూ–5, తమిళం–2, బోటనీ సైన్స్–69, గణితం–33, ఫిజికల్ సైన్స్–29, సోషియల్–133, ఫిజికల్ ఎడ్యుకేషన్–87 వరకు ఉన్నాయి. దీనిపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై రోజుకో ప్రకటన చేస్తుండడంపై నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

ఆందోళనలో అభ్యర్థులు

కూటమి నేతలు ఎన్నికల్లో మెగా డీఎస్సీ హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే ఉత్తుత్తి సంతకాలు చేసి, మమ అనిపించింది. డీఎస్సీ వస్తుందన్న దీమాతో అభ్యర్థులు తాము చేస్తున్న ప్రైవేట్ కొలువులను వదలి, శిక్షణ తీసుకున్నారు. అయితే కూటమి సర్కారు రోజుకో మాట చెబుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల్లో కోత

మెగా డీఎస్సీ సాకుతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను కూటమి ప్రభుత్వం కోత పెడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెలవారీ పదోన్నతుల ప్రక్రియ జరిగేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి ఊసే లేదు. డీఎస్సీ కోసం చూపించిన ఖాళీ విషయంలో జరిగిన తప్పిదాలతో మరోసారి ఖాళీల గుర్తింపుపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం రోజుకో నిర్ణయం తీసుకుంటుండడంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీపై నీలినీడలు కమ్ముకుంటుండడంతో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అక్రమంగా లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాల సమాచారం ఇస్తే రూ.లక్ష బహుమతి అందజేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. చట్టాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆశాకార్యకర్తలు డెకాయ్ ఆపరేషన్‌తో లింగ నిర్ధారణ చేసినట్లు స్కానింగ్ కేంద్రాలను పట్టిస్తే రూ.లక్ష బహుమతిగా ఇస్తామన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలు పట్టించిన ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఆశా కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలను ఢీకొన్న స్కూల్ బస్సు

పుంగనూరు: మండలంలోని ఉలవలదిన్ని గ్రామ సమీపంలో స్కూల్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మహిళలు గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని బోడేవారిపల్లెకు చెందిన నీలావతమ్మ(55), భార్గవి(26) ద్విచక్ర వాహనంపై వస్తుండగా స్కూల్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే గాయపడిన బాధితులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు లక్ష్మి



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వి.కోట: మండలంలోని పాముగానిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లక్ష్మి జాతీయ స్థాయి అండర్–14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 23, 24, 25 తేదీల్లో పల్నాడు జిల్లా కారంపూడిలో జరిగిన అండర్–14 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఆ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్ష్మిని త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థిని పాఠశాల పీడీ సురేష్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

బోయకొండ ఆదాయం రూ.69.17లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం నిర్వహించిన హుండీ కానుకలు లెక్కింపు ద్వారా రూ.69.17 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.69,17,185, బంగారం 38 గ్రాములు, వెండి 350 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ లభించినట్లు తెలిపారు. రణభేరి గంగమ్మ ఆలయంవద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.45,844 సమకూరిందన్నారు. ఈ ఆదాయం 57 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి

పాలసముద్రం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఇప్పటి నుంచే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. ఆమె గురువారం పాలసముద్రం ఉన్నత పాఠశాల, బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకంలో తాజా కూరగాయలు వాడాలని ఆమె సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. బియ్యాన్ని ఒకటికి రెండు సార్లు మంచి నీటితో కడిగిన తరువాతనే అన్నం చేయాలని హెచ్చరించారు. మరుగుదొడ్లు పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని తెలిపారు. అనంతరం పలు రికార్డులను తరువుగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదీ హారతి రేపు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శివలింగ విద్యుత్ కటౌట్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో స్వర్ణముఖి నదిలో శనివారం నదీహారతి సమర్పించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటలకు స్వర్ణముఖి నది తల్లికి కలశ పూజలు, ధూప, దీప నైవేద్యాలు, మహాదీపారాధన చేయనున్నట్లు తెలిపారు. భక్తులు వీక్షించడానికి ఏర్పాట్లు కూడా చేసినట్లు పేర్కొన్నారు. నదీహారతులను పురస్కరించుకుని శనివారం ఆలయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు మినహా మిగిలిన ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు చెప్పారు.

నదీ హారతులకు ఏర్పాట్లు ముమ్మరం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో స్వర్ణముఖిలో కార్తీక మాసం సందర్భంగా జరగనున్న నదీహారతుల కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పట్టణంతోపాటు ఆలయ పరిసరాలు విద్యుత్ దీపకాంతులు ధగధగలాడుతున్నాయి. దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకుంటున్నాయి.

గంజాయి విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయిసున్న ఎస్.జబ్బార్ అనే నిందితుడిని చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పలమనేరులోని సీపీ కురుపల్లె కాలనీ వద్ద ఎస్‌ఐ సుబ్రమణ్యం తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇదే గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న జబ్బార్ అనే నిందితుడిని అరెస్టు చేసి, 144 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నాలుగు రోజుల క్రితం జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు ఎం.మహేంద్రను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు, ఈ నెల 25వ తేదీన రాత్రి సంతపేట లిల్లీ బ్రిడ్జి వద్ద నిల్చుని ఉన్న విఘ్నేష్‌ను కత్తితో పొడిచి పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారించగా, పాత కక్షల నేపథ్యంలో హత్యాయత్నం చేసినట్లు గుర్తించారు. నిందితుడ్ని కైలాసపురం వద్ద అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

గౌరవ వేతనం విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని సర్పంచ్‌లకు గౌరవ వేతనం వచ్చినట్లు డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆగస్టు నుంచి నవంబరు వరకు నాలుగు నెలల వేతనం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలో 697 పంచాయతీలు ఉండగా అందులో 12 పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. దీంతో మిగిలిన 685 పంచాయతీల సర్పంచ్‌లకు రూ.1,16,72000 విడుదలైందన్నారు. వీటిని త్వరలో సర్పంచ్‌ల బ్యాంకు ఖాతాలకు వేయనున్నట్లు వివరించారు.

అప్పు చెల్లించలేదని స్నేహితుడినే చంపేశాడు

- నిందితుడి అరెస్టు
- హత్య కేసు ఛేదించిన పోలీసులు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వి.కోట : అప్పు చెల్లించలేదన్న కారణంతో స్నేహితుడినే హతమార్చిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ ప్రభాకర్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు తెలిపారు. మండలంలోని కొంగాటం పంచాయతీ చింతలా ఎల్లాగరం గ్రామానికి చెందిన సుకూర్ సాబ్ కుమారుడు సర్దార్, నవాజ్ బాషా ఇద్దరు మంచి స్నేహితులు. అయితే 2021లో నవాజ్ బాషాకు డబ్బులు అవసరమై సర్దార్‌ను అప్పు అడిగాడు. సర్దార్ ఒక మహిళ వద్ద వడ్డీకి రెండు సార్లుగా రూ.1,00,000 తీసి నవాజ్‌కు ఇచ్చాడు. ఈ డబ్బుకు వడ్డీ కానీ, అసలు కానీ చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి సర్దార్‌పై పడింది. దీన్ని అవమానంగా భావించి నవాజ్ బాషాను చంపేస్తే అప్పు తీర్చేపని ఉండదని భావించి చంపడానికి నిర్ణయించుకున్నాడు. అయితే అదే ఏడాది మేలో చంపడానికి ప్రయత్నించగా కుదర్లేదు. అయితే ఈ నెల 21 తేదీన రాత్రి 8.30 గంటల సమయంలో తన ఇంటిలో మద్యం తాగి పడుకుని ఉన్న నవాజ్ వద్దకు సర్దార్ వచ్చాడు. పాలేరు నదిలో చేపలకు వల వేశాను దానిని తీసుకువద్దామని చెప్పి తన బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే పాలేరు నది ఒడ్డున పక్కనే ఉన్న మామిడి తోటలో మద్యం తాగించి, నవాజ్‌ను కొయ్యతో బాది చంపేశాడు. ఆ తరువాత ముఖానికి పట్టతో కట్టి డ్రిప్‌పైపుల సాయంతో నదిలోని గడ్డికి కట్టి శవాన్ని దాచిపెట్టేశాడు. దీంతో నవాజ్ హత్యకు సంబంధించి పోలీసులు దర్యాప్తు కొనసాగించారు. నిందితుడు ఆచూకీ తెలుసుకోవడానికి సీఐ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా దర్యాప్తు చేశారు. దీంతో గురువారం సర్దార్ పట్టణ సమీపంలోని కేజీఎఫ్ రోడ్డు వద్ద గల హంద్రీ నీవా కాలువ వద్ద ఉండగా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు హత్య చేసినట్లు నేరం ఒప్పుకోవడంతో హత్యకు ఉపయోగించిన కొయ్యను స్వాధీనం చేసుకుని నిందితున్ని కోర్టుకు తరలించారు.

బావిలో పడి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

- సురక్షితంగా బయటపడ్డ మరో విద్యార్థి



మృతి చెందిన రితేష్ (ఇన్‌సెట్–ఫైల్)

ఐరాల: వ్యవసాయ బావిలో పడి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా, మరో ఇంజినీరింగ్ విద్యార్థి సురక్షితంగా బయటపడ్డ సంఘటన మండలంలోని మద్దిపట్లపల్లె సమీపంలో గురువారం వెలుగుచూసింది. కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర కథనం మేరకు, యాదమరి మండలం కమ్మరాయనిమిట్టకు చెందిన లోకచంద్రారెడ్డి కుమారుడు టీఏల్.రితేష్(19), చిత్తూరు నగరానికి చెందిన స్నేహితుడు టీ.ఉదయ్‌కిరణ్ ఇద్దరు పీలేరు ఎంజేఆర్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. వీరిద్దరూ బుధవారం ద్విచక్ర వాహనంలో కళాశాలకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వారి స్వగ్రామాలకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అతివేగంతో మద్దిపట్టపల్లె సమీపంలోని పేరూరు చెరువు మలుపు వద్ద బైక్‌ను అదుపు చేయలేక చెరువు కింద స్థానిక రైతు సుబ్రమణ్యంనాయుడుకు చెందిన వ్యవసాయ బావిలో పడిపోయారు. బైక్ రోడ్డుకు ఎడమవైపు మట్టిపై పడి ఉంది. బైక్‌లో వెనుక కూర్చున్న ఉదయ్‌కిరణ్ బావిలో నుంచి చెట్టు తీగల సాయంతో ఒడ్డుకు చేరుకున్నాడు. ఇతనికి శరీరంలో అక్కడక్కడ స్వల్ప గాయాలయ్యాయి. ఉదయ్‌కిరణ్ ప్రమాదం జరిగిన సమాచారాన్ని ఫోన్ ద్వారా రితేష్ తండ్రికి అందజేశారు. ఆయన వారి బంధువులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో బావిలో నుంచి రితేష్‌ను వెలికితీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టమాట ధరలు పైపైకి!

- పలమనేరులో బాక్సు ధర రూ.600 పైగా
- ఎటూచూసినా వైరస్, మంచు, వర్షాలతో తగ్గిన నాణ్యత
- దీంతో జిల్లాలోని మార్కెట్లకు తరలివస్తున్న బయటి వ్యాపారులు



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటలు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలు	
రబీలో టమాట సాధారణ సాగు	5వేల హెక్టార్లు
ప్రస్తుతం సాగైన పంట	4వేల హెక్టార్లు
ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు	3వేల హెక్టార్లు
ఏటా ఈ సీజన్‌లో మండీలకు వచ్చే సరుకు	200 లారీ లోడ్లు
ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు	150 లోడ్లు

పలమనేరు: స్థానిక హార్టికల్చర్ డివిజన్‌లో టమాట ధర రోజురోజుకీ పెరుగుతోంది. పలమనేరు టమాట మార్కెట్‌లో గత నెల రోజులుగా ధరలు పెరుగుతున్నాయి. స్థానిక మార్కెట్‌లో గురువారం 14కిలోల బాక్సు ధర రూ.600 నుంచి రూ.650 పలికింది. పొరుగునే ఉన్న కర్ణాటకలోని వడ్డిపల్లి టమాట మార్కెట్‌లో టాప్ సరుకు బాక్సు ధర రూ.700 దాటింది. బయటి రాష్ట్రాలనుంచి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు వస్తుండడం, ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో టమాటకు వైరస్ తెగులు, చలిమంచు, వర్షాల కారణంగా కాయల నాణ్యత తగ్గింది. దీంతో ఇక్కడున్న నాణ్యమైన సరుకుకు ధర పెరిగినట్టు మండీ వ్యాపారులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల చూపు ఇక్కడి మార్కెట్లవైపే...

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వి.కోట, సోమల, సదుంలలో టమాట మార్కెట్లున్నాయి. రబీ సీజన్ ఆరంభానికి ఇక్కడి మార్కెట్లకు 200 లోడ్లు టమాట రావాల్సి ఉండగా ఇప్పుడు 150 లోడ్లు మాత్రమే వస్తున్నాయి. ఇదే సమయంలో బయటి రాష్ట్రాల్లో టమాటలు లేవు. ప్రస్తుతం పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలోని కోలారు, అన్నమయ్య, అనంతపూర్ ప్రాంతాల నుంచి మాత్రమే టమాటకు వస్తున్నాయి. అయితే అన్ని ప్రాంతాలకంటే ఇక్కడి సరుకు నాణ్యంగా ఉంది. దీంతో బయటి రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు వస్తున్నారు. కావాల్సినంత సరఫరా లేకపోవడం, సరుకు నాణ్యత లేకపోవడంతో టమాటకు డిమాండ్ ఏర్పడి ధరల పెరుగుదలకు కారణమైంది.

వెయ్యి దాటే అవకాశం



బయటి రాష్ట్రాల్లో టమాటలు నాణ్యత లేకపోవడం, స్థానికంగా ఉన్న సరుకు తక్కువగా ఉండడంతో పాటు నాణ్యతగా ఉండడంతో టమాటకు ధర వచ్చింది. ఈ నెలంతా ధరలు బాగానే ఉండే అవకాశం ఉంటుంది. ఇప్పుడు పిందెదశలో ఉన్న తోటలకు సైతం ధరలు బాగుంటాయి. మరో నెలలో బాక్సు వెయ్యి దాటడం ఖాయంగా కనిపిస్తోంది. – ఎన్వీ నాగిరెడ్డి, టమాట మండీ యజమాని, పలమనేరు

ఈ ధరలుంటే నష్టం రాదు



గతంలో టమాట సాగు చేసి పంట పెట్టుబడి రాక అప్పుల పాలయ్యాను. ఈ దఫా మూడెకరాల్లో టమాటను అదునుల్లో సాగుచేశా. ఎందుకంటే ఓ అదునులో ధర లేకున్నా మరో అదునులో ధర ఉంటుందని ముందుగా భావించాను. ఇప్పుడు బాక్సు ధర రూ.600కి పైగా ఉంది. ఈ మాత్రం ధరలుంటే టమాట రైతులకు నష్టాలు రానట్టే. – రవీంద్రారెడ్డి, కూర్మాయి, పలమనేరు మండలం